## క్లుప్తంగా

### మృతుడి కుటుంబానికి సాయం

2007–08 పదోతరగతి మిత్రబృందం చేయూత



మృతుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న పదోతరగతి బాల్యమిత్రులు

బొంరాస్‌పేట: మెట్లుకుంట గ్రామానికి చెందిన మృతుడి కుటుంబాన్ని 2007–08 పదోతరగతి మిత్ర బృందం చేయూతనిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి..మెట్లకుంటకు చెందిన గురుదొట్ల కృష్ణ ఏసీ మెకానిక్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 10న ఓ ఇంట్లో మెకానిక్ పనిచేస్తుండగా విద్యుదాఘాతంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పదోతరగతి స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తమవంతు సాయంగా రూ.60వేలు భార్య పూజ, కూతురు నిత్యశ్రీకి అందజేశారు.

### బాడీ బిల్డింగ్‌లో హస్నాబాద్ యువకుడు

అభినందిస్తున్న మండలవాసులు



ప్రదర్శన ఇస్తున్న బిరేందర్

దుద్యాల్: కర్నాటక రాష్ట్రంలోని కునిగల్ పట్టణంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ ప్రదర్శనలో హస్నాబాద్ గ్రామానికి చెందిన యువకుడు ఆకట్టుకుంటున్నాడు. కునిగల్ పట్టణంలో రెండు రోజుల క్రితం హిందూ మహాగణపతి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్‌లో ప్రదర్శనలిచ్చాడు. అత్యుత్తమైన శరీర ఆకారంతో అందరిని ఆకట్టుకుంటున్నాడు. అందుకుగాను ఆ సంఘం సభ్యులు ప్రత్యేకంగా సత్కరించారు. మండలానికి చెందిన యువకుడు కావడంతో మండల వాసులు కూడా అభినందిస్తున్నారు.

### హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు బాధాకరం

అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు నర్సింహ యాదవ్



ఫిర్యాదు చేస్తున్న హిందూ సంఘాల నేతలు

దోమ: హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు నర్సింహ యాదవ్ పేర్కొన్నారు. దోమ మండల పరిధిలోని శివారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇన్‌స్టాగామ్‌లో శ్రీకృష్ణుడు, వినాయకుడితో పాటు ఇతర దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టాడని తెలిపారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వాటిని చూసిన హిందూ సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. దీంతో ఈ విషయంపై ఆదివారం నర్సింహా యాదవ్‌తో పాటు హిందూ సంఘాల నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిని పరిగి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దీని గురించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకునేలా పోలీసులు ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

### బీఆర్‌ఎస్ గ్రామ యూత్ కమిటీ ఎన్నిక

శంకర్‌పల్లి: గ్రామాల్లోని యువత రాజకీయాల్లోకి రావాలని మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండకల్‌లో గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ యూత్ కమిటీని ఎన్నుకోగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామ అధ్యక్షుడిగా రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా రాము, ప్రధాన కార్యదర్శిగా కే.అనిల్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని యువత బయటకు రావాలని, రాబోయే రోజుల్లో రాజకీయాల్లో వారిదే కీలకపాత్ర అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అన్ని స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు బి.సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కొరత.. రైతన్న కలత!



బాలంపేటలో యూరియా టోకెన్ల కోసం రైతుల క్యూ

- అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి
- మండలానికి 635 టన్నులకు గాను 315 టన్నులు పంపిణీ
- ఆందోళనలో అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: వానాకాలం పూర్తి కావస్తోంది. పంటల సాగు చేసిన రైతులకు యూరియా కొరతతో కలత చెందుతున్నారు. ముఖ్యంగా డీఏపీ ఎరువుల కొరత తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. పంటలకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ప్రతిపక్షాల నాయకులు, రైతులు ఘాటుగానే విమర్శిస్తున్నారు. పంటలకు సకాలంలో ఎరువులు వేయకపోవడంతో దిగుబడిపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఎరువుల కోసం తెల్లవారజామునుంచే ఫర్టిలైజర్ దుకాణాల వద్ద క్యూలో నిల్చుంటున్నారు. గంటల తరబడి ఉన్నప్పటికీ కొందరికి దొరకడం లేదని పేర్కొంటున్నారు. అదనులో ఎరువు వేయకుంటే పంటలు దెబ్బతింటాయని ఆవేదన చెందుతున్నారు.

**టోకెన్లు ఇచ్చి మర్నాడు పంపిణీ..**

మండలంలో 14వేల ఎకరాల్లో పత్తి, వరి సాగు చేస్తున్నారు. మండలానికి 635 టన్నుల యూరియా అవసరముండగా ప్రస్తుతం 315 టన్నులే పంపిణీ చేశారు. మండలంలో కోఆపరేటివ్ సొసైటీ నుంచి పంపిణీ చేయాల్సి ఉండగా వారు లైసెన్స్ తీసుకోలేదని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. దీంతో మండల పరిధిలోని బాలంపేట, దేవర్‌ఫసల్వాద్ గ్రామాల్లో ఆగ్రో కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. యూరియా కొరతతో ముందు రోజు టోకెన్లు పంపిణీ చేసి మరుసటి రోజు అందజేస్తున్నారు. ఒక్కో రైతు దీనికోసం రెండు రోజుల పాటు తిరగాల్సి వస్తుందని, ఈ విషయంలో తమ సమస్య పరిష్కరించే వారు కరువయ్యారని చెబుతున్నారు.

**నానోపై అవగాహన అంతంతే..**

యూరియా కొరత నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా నానో వినియోగించేలా అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. అధికారులు మాత్రం నామమాత్రంగా ప్రైవేట్ కంపెనీలు నిర్వహించే సమావేశాల్లో పాల్గొని మమ అనిపించేస్తున్నారు. ఎరువులపై సబ్సిడీ ఎత్తివేయడంతో దీని ధరకు, మిగతా ఎరువుల ధరల మధ్య వ్యత్యాసం భారీగా ఉంటుంది. ఇలా పెరిగిన ధరలతో కాంప్లెక్స్ ఎరువులు కొనలేక పైరుకు ఏదో ఒకటి వేయాలన్నా ధోరణితో యూరియా వైపే మొగ్గుచూపుతున్నారు.

### సరిపడా అందించాలి..



అధికారులు కొరతను నివారించాలి. పంటలకు సకాలంలో ఎరువులను అందించకపోతే దిగుబడి తగ్గుతుంది. అదను దాటిన తర్వాత ఎరువులను వేసినా ఆర్థికంగా నష్టం తప్ప ప్రయోజనం చేకూరదు. దీంతో పంటలకు భారీ నష్టాలు తప్పవు.

– బసయ్య, దౌల్తాబాద్

### కొరత లేకుండా చూస్తున్నాం..



వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పంటలకు 635 టన్నుల యూరియా అవసరం ఉండగా, ప్రస్తుతం ఆగ్రో కేంద్రాల ద్వారా 315 టన్నుల పంపిణీ చేశాం. రైతులకు ద్రవ రూపంలో ఉండే నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించినప్పటికీ ఆ వైపు మొగ్గు చూపుతున్నారు. యూరియా కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

### యూరియా కోసం బారులు

అనంతగిరి: యూరియా కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు రైతులు వాపోతున్నారు. ఆదివారం ఉదయం వికారాబాద్‌లోని ఆగ్రో సెంటర్ వద్ద ఉదయం నుంచే బారులు తీరారు. ఒక్కరికి ఒకటి, రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారాని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు సరిపడా సరఫరా చేయాలని పలువురు డిమాండ్ చేశారు.



వికారాబాద్‌లో యూరియా కోసం బారులు తీరిన రైతులు

# మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు నర్సింహా రెడ్డి

దుద్యాల్: మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండల మహిళా సమైఖ్య భవనం, ప్రభుత్వ పెట్రోల్ బంక్ మంజూరు చేశారన్నారు. వాటిని మహిళా సంఘాలు నిర్వహించనున్నట్లు, వారి అభివృద్ధికోసం ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు వెంకటయ్య, సీనియర్ నాయకులు సంజీవ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, యుగందర్ రెడ్డి, చాకలి శ్రీనివాస్, మహిళాసంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



జ్ఞాపికలతో ఉపాధ్యాయులు



తాండూరు: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కొడంగల్: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సత్కరించారు. కొడంగల్, బొంరాస్‌పేట మండలాలకు చెందిన ఉపాధ్యాయులు బాకారం మల్లయ్య, శ్రీప్రియ, ఏసురత్నం, లక్ష్మీలకు శాలువా కప్పి జ్ఞాపిక అందజేసి సన్మానించారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు ముద్దప్ప దేశ్‌ముఖ్, ఎంఈఓ రాం రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట, కార్యదర్శి భీమ్‌రాజ్, కోశాధికారి వెంకట్‌రెడ్డి దేశ్‌ముఖ్‌లు అభినందించారు.

**లయన్స్ ఇంటర్‌నేషనల్ జిల్లా 32ఏ..**

తాండూరు: లయన్స్ ఇంటర్‌నేషనల్ జిల్లా 32ఏ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్‌లో శిక్షక్ వందనం నిర్వహించారు. వికారాబాద్ జిల్లాలో ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలు అందిస్తున్న బి.వెంకట్‌రెడ్డి (పెద్దేముల్), వీ.సత్యం(పెద్దేముల్ మండలం), శ్రీనివాస్( వికారాబాద్ మండలం), విజయకుమార్(బషీరాబాద్ మండలం), టీ.కృష్ణయ్య యాలాల మండలాలకు చెందిన ఉపాధ్యాయులను లయన్స్ ఇంటర్‌నేషనల్ ప్రతినిధులు, తాండూరు లయన్స్ క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ జి.మహేందర్‌కుమార్‌రెడ్డి, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాండూరు అధ్యక్షుడు శరణబసప్ప, కోశాధికారి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయాలను పరిరక్షించాలి



బతుకమ్మ సంబురాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అనంతగిరి: ప్రతిఒక్కరూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలని సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం వికారాబాద్ పట్టణంలోని సిద్ధార్థ పాఠశాలలో నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్కార భారతి జాతీయస్థాయిలో పనిచేస్తుందన్నారు. కార్యకర్తలందరూ సమన్వయంతో పనిచేస్తూ సంస్థ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. బతుకమ్మ సంబురాలను, రాబోయే దేవి నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను రాబోయే తరాలకు అందిచాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని వివరించారు. అనంతరం ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్, కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షుడు భద్రపాల్, ఆనంద్, రాఘవేందర్‌రాజు, సంజీవ్, ప్రదీప్, దత్తు, శ్రీనివాస్, నవీన్, మంజుల, మమత తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

సాక్షి, రంగారెడ్డి జిల్లా : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేందుకు అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జన్మదినం సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, మండల అధ్యక్షుడు మాణయ్య ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సేవా పక్షోత్సవాలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

కొందుర్గు: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే సేవా పక్షోత్సవాల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని బీజేపీ చేనేత సెల్ రాష్ట్ర కన్వీనర్ మచ్చ సుధాకర్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మికాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 17న అన్ని గ్రామాల్లో తెలంగాణ విమోచన దినం జరుపుకోవాలని సూచించారు. అదేవిధంగా స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో యువకులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. శివారెడ్డి, బల్వంత్‌రెడ్డి, శ్రీశైలం, అంజయ్య, అశోక్ పాల్గొన్నారు.

# చెరువులకు జలకళ



జలకళను సంతరించుకున్న చిలుకూరు పెద్ద చెరువు



నిండుకుండలా సురంగల్ పెద్ద చెరువు

మొయినాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు పెద్ద చెరువు, ఎనికేపల్లి మాలకుంట, జీవన్‌గూడలోని బంగాలి కుంట, సురంగల్ పెద్దచెరువులు పూర్తిగా నిండి నిండుకుండలా మారాయి. చిలుకూరు పెద్ద చెరువు గత ఇరవై రోజులుగా అలుగు పారుతూనే ఉంది. ఎనికేపల్లి మాలకుంట పూర్తిగా నిండి పదిహేను రోజులుగా దిగువకు నీళ్లు వెళ్తున్నాయి. సురంగల్ పెద్ద చెరువులోనూ పూర్తిస్థాయిలో నీరు నిండడంతో వారం రోజులుగా అలుగు పారుతోంది. ఈసారి వర్షాలు అధికంగా కురవడంతో భూగర్భజలాలు పెరిగాయి. చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండడంతో బోరుబావుల్లో సైతం నీటి మట్టం పెరిగింది.



**రచ్చ బండ కబుర్లు**

సెలవు వచ్చిందంటే చాలు ఆడవారికి కాస్త ఉపశమనం లభిస్తుంది. మిగతా రోజుల్లో కుటుంబం, రోజూవారి పనుల్లో బిజీగా ఉంటారు. కానీ ప్రతీ వారం గ్రామం మధ్యలోని రచ్చబండ వద్దకు వచ్చి సాధకబాధలు మాట్లాడుకుంటూ ఆనందంగా ఉంటారు. దుద్యాల్ మండల పరిధిలోని వాల్యా నాయక్ తండాలో ఆదివారం రచ్చబండ వద్ద మహిళలు ఇలా కూర్చొని సరదాగా ముచ్చట్లాడుతున్న సన్నివేశం కనిపించింది. – దుద్యాల్

### నేడు ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

మర్పల్లి: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై 16వ విడుత సామాజిక తనిఖీ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ అంజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2024, ఏప్రిల్ 1 నుంచి 2025, మార్చి 1 వరకు గ్రామాల్లో చేపట్టిన ఆయా పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న ఓపెన్ ఫోరాన్ని విజయవంతం చేసేందుకు మండల, జిల్లా స్థాయిలోని అధికారులు హాజరవుతారని తెలిపారు. ఆయా పనులపై ఏవైన అభ్యంతరాలు ఉంటే ఓపెన్ ఫోరంలో కూలీలు, రైతులు చెప్పుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమానికి ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, కూలీలు, రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

### గట్టుపల్లి శిలువకొండ ఉత్సవాలు

పూడూరు: మండల పరిధిలోని గట్టుపల్లి శిలువకొండ ఉత్సవాలు ఫాదర్ పౌల్సన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం ఉదయం స్తుతి ఆరాధన, దివ్యబలిపూజ కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిధిలోని భక్తులే కాకుండా ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

### ఉచిత వైద్యసేవలు అభినందనీయం

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పట్లోళ్ల కృష్టారెడ్డి



కాకుంట్లలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు



చేవెళ్లలో వైద్యశిబిరాల ఏర్పాటు సందర్భంగా పల్లకీ సేవలో సభ్యులు, వైద్యులు

చేవెళ్ల: పేద ప్రజలకు గ్రామాల్లోకి వచ్చి అందించే వైద్యసేవలు ఎంతో అభినందనీయమని బీఆర్‌ఎస్ నాయకుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పి.కృష్టారెడ్డి అన్నారు. చేవెళ్ల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ శ్రీసత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని చేవెళ్ల, పామెన, బస్తేపూర్, ఖానాపూర్, కౌకుంట్ల, రామన్నగూడ, తంగడపల్లి, రావులపల్లి, మల్లారెడ్డిగూడ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి.. పేద ప్రజలకు వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా నగరంలోని 12 కార్పొరేట్ ఆస్పత్రుల వైద్యబృందంతో పేద ప్రజలకు అన్ని రకాల వైద్యసేవలను అందించటంతో పాటు ఉచితంగా మందులు, పరీక్షలు చేశారు. మొత్తం 9 గ్రామాల్లో 12 ఆస్పత్రులు, 60 మంది వైద్యులు, 200ల మంది సిబ్బందితో వైద్యశిబిరాలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరాలను ప్రారంభించి మాట్లాడుతూ.. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా సేవలు మరువలేనివన్నారు. మాజీ సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డిలు, ఆయా గ్రామాల్లోని సత్యసాయి సేవా సమితి సభ్యులు, మండల సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.